
# లాస్ట్ జడ్జిమెంట్

ప్రణవి బ్రదర్స్



అంతులేని తృప్తి మిగులుతుంది ! అది ఆయన ధ్యేయం !

* * *

శర్మగారు, శిలాప్రతిమలైన సంతానాన్ని, గుండె పగిలి దుఃఖంతో తలవంచుకున్న భార్యని చూచి, ఒక దీర్ఘమైన శ్వాస తీసుకున్నారు.

"నేను యేనిర్ణయం తీసుకున్నా ఒకటికి రెండుసార్లు బాగా ఆలోచించే ఆ పనిచేస్తాను. అంటే, నా నిర్ణయంతో యెవరు యేకీభవించినా సరే, వ్యతిరేకించినాసరే, అది మారదు! వన్స్ డిసైడెడ్ ఈజ్ డిసైడెడ్ అండ్ సెడ్ ఈజ్ సెడ్! అర్థమైందనుకుంటాను!" మరొక్కసారి అందరి ముఖాలూ పరిశీలించారు. కానీ, ఎవ్వరూ నోరు మెదపలేదు

"పెళ్ళికూతురు గురించి వివరాలు మీరడగ లేదు ! ఫర్వాలేదు ! నేనే చెబుతాను ! అది నా ధర్మం !" కుర్చీనుండి లేచి, చేతులు వెనక్కు కట్టుకొని, మెల్లిగా ఇటూ అటూ నడుస్తున్నారు.

"అమ్మాయికి తల్లీదండ్రీ వున్నారు. పద్దెనిమిదీ, యిరవైయేళ్ళ వయసుంటుంది. బి ఏ. చదివింది. అందంలో అప్సరసలా వుంటుంది. అయితే కట్నాలు యిచ్చుకోలేనంత బీదస్థితి వారిది" శర్మగారు చెబుతున్నారు.

'మరి అందుకే యీ ముసలోడికి యిస్తున్నారు కాబోలు!' పిల్లల మనస్సులో మెదిలిన భావన.


"ఇంకేం ? నేనే మయ్యో గొయ్యో చూచుకుంటాను ! మీరా కుర్రముండను కట్టుకొని, వూరేగండి !" భార్య యేడ్చింది.

"నేను ముందే చెప్పాను మీ అభిప్రాయాలతో నాకు పనిలేదని !" ఆమెవంక తీవ్రంగా చూచి. మళ్ళీ ప్రారంభించారు. "ఆ అమ్మాయి ప్రభుత్వ స్కాలర్‌షిప్‌తో బి. ఏ చదివింది. వాళ్ళు లంబాడీకులస్థులు !" వక్కక్షణం ఆగి, మరోసారి అందరిముఖాలను పరిశీలించారు. యెవ్వరిముఖాల్లోనూ కత్తివాటుకు నెత్తురు చుక్కలేదు.

"సంబడమే ! లంబాడీదాన్ని కాకపోతే, దొమ్మరిదాన్ని కట్టుకోండి!... మాకింత విషమిచ్చి !" నెత్తినోరు బాదుకుంది భార్య.

"మీ ధోరణి మాకేం నచ్చలేదునాన్నారూ!" పెద్దబ్బాయి ధైర్యంచేసి అన్నాడు.

"థాంక్యూ! థాంక్యూ ఫర్ యువర్ కామెంట్ ! నా ధోరణి మీకు యేనాడు నచ్చింది గనుక, యిప్పుడు నచ్చలేదనుకోడానికి ?" తండ్రి




కంఠం కాస్త బిగ్గరగా వినిపించింది

''నువ్వు చదువుకొనేరోజుల్లో నీకు కాలేజీ సీటు దొరకక, రిజర్వేషన్‌చేయబడిన నిమ్న జాతులు, వెనుకబడ్డ కులాలు, జాతులవారి కోటా సీట్లనుగురించి నీవు యేడ్చినప్పుడూ, ఐ ఏ ఏస్ లో సెలెక్టు కానందుకు రెండోవాడు, తక్కువ పర్సెంటుమార్కులతో సెలెక్టయిన రిజర్వుడ్ కోటా కాండిడేట్స్‌మీద విరుచుకుపడ్డప్పుడూ నేను మందలించాను! అగ్రకులాల వారికిచ్చిన కోటాకన్నా, క్రింద తరగతులవారికిచ్చిన కోటా యెంతతక్కువో చూడమన్నాను! అంత పెద్ద కోటానించి ఒక్కసీటు సంపాయించుకోడం చేత కాక, చవటల్లా అవతలివారిమీదపడి యేడవడం తప్పన్నాను! కానీ, అది మీకు నచ్చలేదు!

మేడెక్కి నిచ్చెనలాగెయ్యడం, యేరుదాటి తెప్ప తగలెయ్యడం మన అగ్రకులాలవారికి వెన్నతో పెట్టిన విద్యరా! ఆ దుర్నీతి గ్రహించే, మన నాయకులు క్రిందవారికోసం రిజర్వేషన్లు పెట్టారు! వారుకూడా సాటి మానవులే! వారు బాగుపడాలనే భావనలేకుండా, అయ్యో వాళ్ళు బాగుపడుతున్నారే అని యేడుపురా మీకు! ఆ



## లాస్ట్ జడ్జిమెంట్ !

నిర్భాగ్యుల్ని మనతో సమంగా ఆదరించి, మనలో కలుపుకునేంత ధైర్యం, మీకేవుంటే, మీకుగిట్టని యీ రిజర్వేషన్లతో పనేవుండదుగా? ఈ అసూయలూ, అహంకారాలూ తలెత్తవుగా! సర్వ మానవ సమత్వం రావాలిరా! అందుకే యెట్‌లీస్టు నేను ఆ లంబాడీ అమ్మాయిని పెళ్ళి చేసుకోబోతున్నాను! తెలిసిందా?'' శర్మగారు చాలా ఆవేశపూరితంగా అన్నారు.

''బావుంది మీ ఆదర్శం!'' పెద్దవాడు లేచాడు వాతావరణం కాస్త ఆవేశపూరితంగా వుంది

''ఇదే ఆదర్శాన్ని మీరు మీ వివాహానికి ముందు వల్లిస్తే చాలా చాలా బావుండేది!''

అంతలో రెండోవాడందుకున్నాడు ''ఇప్పుడు దీన్ని ఆదర్శమనరు! 'కామం' అంటారు! అందంగావున్న ఒక ఆడపిల్లకి 'ఆశయం'పేరిట వురిబిగించడమంటారు!'' ఆవేశంగా అన్నాడు

''అయామ్ సారీ మై సన్! అయామ్ సారీ! అరచే కుక్కలు కరవవని నాకు బాగా తెలుసు! ఐ డోంట్ కేర్! నేను చెయ్యబోయే పనికి యెవరు యే పేరు పెట్టినా ఐ డోంట్ కేర్! యెంత అనుభవం, యెంత పరపతి సంపాయించాక యీ పని చేయబోతున్నానో మీకు తెలుసు! దానికి గట్స్ కావాలి! ఐ హావ్ గట్స్! మీలో యెవరికైనా ఆ అమ్మాయి ఫోటో చూడాలనే యింట్రెస్టు వుంటే'' అంటూ శర్మగారు జేబులోంచి ఒకఫోటో తీశారు

వెంటనే చిన్న కూతురు వచ్చి ఫోటో తీసుకుంది. తరువాత తల్లి తప్ప పిల్లలంతా చూశారు

కోల ముఖం. గుండ్రని కళ్ళు పొడవైన ముక్కు. చిన్న నోరు చాల చక్కగా, సినిమా స్టార్‌ని తలదన్నినట్లుంది లంబాడీ అలంకరణలు లేవు.

ముసలివారైన శర్మగారికే కాదు, ఆ అమ్మాయిని చూచిన యే మగాడికైనా, అలాంటి కోరికే కలుగుతుంది.

* * *

శర్మగారి మీదనున్న గౌరవం కొద్దీ, న్యాయవాదులంతా ఆ రోజుకి తమ తమ కేసులకి వాదనలు చేయకుండా, వాయిదాలు వేయించుకొని, జడ్జిగారిని ప్రశాంతంగా రెటైర్ చేయించాలని తీర్మానించుకున్నారు

అలాగే కేసులకు యెడ్జార్నమెంటులు తీసుకుంటున్నారు అన్నీ అనుకున్నట్లే సాగిపోతున్నాయి. ఆఖరి సమయం అకస్మాత్తుగా ఒక ఆత్మహత్య కేసు ప్రవేశపెట్టబడింది దానితో కోర్టు వాతావరణం మారింది

జీవితంలో ఓడిపోయిన ఒక స్త్రీ తన ప్రాణాలను తానే తీసుకోవడంలో కూడా ఓడిపోయి, పోలీసులకు దొరికిపోయింది

ఒక మనిషికి తన ప్రాణం తన స్వంతం కాదని, అది తన తల్లిదండ్రుల స్వార్జితమని, దానిని తుదముట్టించే హక్కు తనకు లేదని, జస్టిస్ రామశర్మగారు భారతీయ శిక్షాస్మృతి ననుసరించి ఆ అమ్మాయికి తగిన శిక్ష విధించారు

కానీ, అంతరాంతరాల్లో శర్మగారికి యేదో చెప్పరాని బాధ! తెలతెల వారుతూండగా, నిశ్చలమైన నీటిలో రాయి వేసినట్లనిపించింది ఒక న్యాయాధికారిగా, ఆ అమ్మాయికి తాను చేసింది న్యాయమా?.

కోర్టు ముగిసి, వీడ్కోలు విందు అయ్యాక, శర్మగారు తిన్నగా పోలీసుస్టేషన్ కొచ్చి, జడ్జిగా రిటైరయ్యాను కనుక, మామూలు వ్యక్తిగా, ఆ అమ్మాయికి శ్రేయోభిలాషిగా ఒక్కసారి ఆ అమ్మాయిని చూస్తానన్నారు

సగౌరవంగా, పోలీసు వారంగీకరించి, ఆయనను లోపలికి తీసుకెళ్ళారు

* * *

''మీరు నిజంగా ఆదర్శవంతులవ్వాలనుకుంటే,'' పెద్దవాడు ధైర్యం చేశాడు. ''ఆ అమ్మాయిని మీరు భార్యగానే చేసుకోనక్కర్లేదు!''

శర్మగారు బిగ్గరగా నవ్వేశారు ''అన్న

మైంది. అర్థమైంది. నేను చెయ్యబోయే పని, నువ్వే చేస్తానంటావు !''

''నాన్నారూ !...'' బిగ్గరగా అరిచాడు పెద్దకొడుకు.

''డోంట్ బి లౌడ్ మై సన్! బి క్వయట్!. . ఆ అందమైన అమ్మాయి వుద్యోగం కోసం ప్రయత్నిస్తూంటే అది పసిగట్టాడొక ప్రబుద్ధుడు! ఉద్యోగ మిప్పిస్తానని ఆశపెట్టి, తనచుట్టూ తిప్పుకున్నాడు. పెళ్ళికూడా చేసుకుంటానంటూ, శీలాన్ని కొల్లగొట్టాడు! ఆవిడ గర్భిణి అయిందని తెలీగానే, ఆ ఆగర్భ శ్రీమంతుడు అంతర్ధానం అయ్యాడు!

అగ్రకులపువాడి అధమ గుణానికి బలైన ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకోబోయి పోలీసు లకు పట్టుబడింది. ఈ రోజు నా జీవితంలో అదే ఆఖరి కేసు కోర్టులో ఒక జడ్జిగా ఆమెను శిక్షించాను. కానీ, నా మనసుకు తృప్తి కలగ లేదు 'అసలు ఆ అమ్మాయి చేసిన నేరమేమిటి? దానికెవరు బాధ్యులు?' అని ఒక మానవతావాదిగా యోచించి, ఆ గర్భిణీ స్త్రీని నేనే స్వయంగా ఆదుకోవాలనుకున్నాను

కోర్టు ముగిసిన వెంటనే పోలీసు స్టేషన్ కెళ్ళి ఆ అమ్మాయితో మాట్లాడి, ధైర్యం చెప్పి, 'నేనున్నాను నీకేం పర్వాలేదు' అని హామీ యిచ్చి వచ్చాను'' రామశర్మగారు అంటూ, కర్చీఫ్ తీసి, ముఖానికి పట్టిన చెమటను అద్దుకున్నారు.

## రాత్రి

నాన్న అలా నైట్‌డ్యూటీకి వెళ్ళగానే
అల్లరి పిల్లలంతా అమ్మచుట్టూ
చేరినట్లు
తార పాపాయిలందరూ
తళుకు కన్నులతో
చల్లటి కథలు వింటూ
రాత్రంతా మేలుకుంటారు
ఎర్రబడ్డ కళ్ళతో నాన్న
నైట్ డ్యూటీనుంచి రాగానే
ఎక్కడివాళ్ళక్కడ సర్దుకుంటారు
అమ్మేమో వంటింట్లోకి వెళ్ళిపోతుంది.

— కె. గోదావరిశర్మ

అప్పటివరకూ ఆ అమ్మాయి ఫోటోనే చూస్తున్న చిన్నకొడుకు, ''నాన్నారూ!. '' గొంతు పెగిల్చాడు.

యేమిటన్నట్లు చూచారు శర్మగారు

''నాదొక చిన్న సలహా!. . ఇంత పేరు ప్రఖ్యాతులు పొందిన మీరు, ఇంకా వయస్సులో ఆ పని చేసి, అపకీర్తి పాలవ్వడం నా కిష్టం లేదు నేనింకా పెళ్ళి కానివాడినే! నేనే ఆ అమ్మాయిని పెళ్ళాడతా!'' వినమ్రంగా అన్నాడు.

పెద్దన్నయ్యకు వచ్చిన అభిప్రాయం కూడా అదే! ''అవును నాన్నారూ! చినబాబుకి చేసెయ్యండి !''

''కానీ, ఆవిడ గర్భవతి ?'' శర్మగారన్నారు

''పర్వాలేదు !'' మెల్లగా అన్నాడు చిన్నోడు

''వెరీగుడ్ ! ఆ ధైర్యమే కావాలి యువతరానికి! కానీ చినబాబూ! ఇది ఆదర్శమా? అపరాధమా ? నీ దృష్టిలో ?'' శర్మగారు అడిగారు

''అ అ అపరాధమే నాన్నారూ! నేనే ఆ అమ్మాయిని మోసం... చేశా!'' తల దించుకొని, నేలచూపులు చూస్తూ అన్నాడు చినబాబు. అతని కంఠం వణికింది

''దట్సాల్ మై డియర్ వైఫ్ అండ్ చిల్డ్రన్! దిసీజ్ మై లాస్ట్ జడ్జిమెంట్!'' రిటైర్డ్ జస్టిస్ రామశర్మగారు అందరివంకా గర్వంగా చూచారు

''నా సర్వీసులో ఆఖరి కేసులోకూడా నేను న్యాయమే చేశాను. ఐ మస్ట్ థాంక్ గాడ్! నా మనస్సుకి యిప్పుడెంతో సంతోషంగా వుంది! యెంతో తృప్తిగావుంది! యేమోయ్! లేలే! ఇక నీ కన్నీళ్ళని ఆనంద భాష్పాలుగా మార్చు! వెంటనే పెళ్ళికి యేర్పాట్లుచేస్తే, మనకి అయిదారు నెలల్లోనే మనవడినో, మనవరాలినో యిచ్చేస్తాడు మన సుపుత్రుడు!'' శర్మగారన్నారు

ఆ మాటలకు మిగతావారంతా గొల్లున నవ్వారు. ★

